## పీజీడీసీఏ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీడీసీఏ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీడీసీఏ (సీబీసీఎస్) మొదటి, రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు.

## డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల చివరి సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ అన్ని కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## బీఈడీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 5వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

# పనులు సకాలంలో పూర్తి చేయాలి

● అభివృద్ధి పనుల పరిశీలనలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

అధికారులతో కలిసి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జూన్6: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్ స్కూల్ సమీపంలో కొనసాగుతున్న కచ్చామోరి పనులను శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వరద ముప్పు తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, మీడియా ఇన్‌చార్జి ముచ్చుక్కుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్, ఎస్టి ప్రేమ, గడ్డమిది శ్రీనివాస్, రవిశంకర్, కుమారస్వామి, హనుమంతు, బి.కిరణ్‌కుమార్, విఠల్, వంశీ, పాండునాయక్, రచ్చనరేష్, ఎండీగౌస్, రత్నయ్య, జీహెచ్ఎంసీ డీఈలు గీత ,సన్నీ , వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం పంపిణీ పరిశీలన...

ప్రజలకు ఇబ్బంది కలగకుండా సన్న బియ్యం పంపిణీ చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో సన్న పంపిణీబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏ విధంగా పంపిణీ జరుగుతుందో రేషన్ డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు, అదేవిధంగా ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బక్రీద్ ఏర్పాట్లు పరిశీలించిన కార్పొరేటర్, అధికారులు

చిలకలగూడ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత, అధికారులు

అడ్డగుట్ట, జూన్ 6: బక్రీద్ పర్వదినం సందర్భంగా చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత, అధికారులు శుక్రవారం పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముస్లిం సోదరులు పాలిథిన్ కవర్లను మాత్రమే వినియోగించాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సూచించారు. జంతు వ్యర్థాలను పరిసరాల్లో పడేయకుండా పాలిథిన్ కవర్లలో వేయాలని, అదేవిధంగా సదరు కవర్లను చెత్త సేకరించే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని ఆమె ఈ సంద్భంగా సూచించారు. బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలతో ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి, జీహెచ్ఎంసీ, చిలకలగూడ పోలీసులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను సిబ్బందికి అందజేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ముస్లింల పర్వదినమైన బక్రీద్ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ నిమిత్తం వారికి పాలిథిన్ కవర్లను నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆమె కవర్లను పంపిణీ చేస్తున్న సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జంతు వ్యర్థాలను పరిసరాల్లో పడేయకుండా కవర్లలో నింపి, చెత్త సేకరించే జీహెచ్ఎంసీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. దీనిద్వారా ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కవర్లను పంపిణీ చేస్తున్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, తదితరులు

## భూమయ్యకు జీవన సాఫల్య పురస్కారం

పురస్కారాన్ని అందజేసిన మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, జూన్ 6: కిన్నెర ఆర్ట్స్ థియేటర్, వాసా ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఆచార్య హనుమాండ్ల భూమయ్యకు డాక్టర్ వాసా ప్రభావతి జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమయ్యకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఆచార్య సూర్యధనంజయకు గురుదేవో గురు పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం, రచయిత్రి శైలజా మిత్ర, గుడిపాటి వెంకటేశ్వర్లు, పుత్తూరు సుబ్బారావు, మద్దాలి రఘురాం, వాసవి చౌదరి, రమ్యవేణి, వాసా ప్రకాష్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# స్పా ముసుగులో సెక్స్ రాకెట్

- పురుషులకు స్త్రీలతో మసాజ్, ఆపై వ్యభిచారం
- పోలీసులకు పట్టుబడ్డ 10 మంది యువతులు, ఏడుగురు విటులు, ఆరుగురు నిర్వాహకులు

వెంగళరావునగర్, జూన్ 6: బయటికి చూడ్డానికి అవో స్పా సెంటర్లు.. లోపల జరుగుతున్న తంతు వేరు. స్పా ముసుగులో సెక్స్ రాకెట్లను నిర్వహిస్తున్న కేంద్రాలపై టాస్క్ ఫోర్స్, సీసీఎస్, ఎస్ఆర్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. 10 మంది యువతులు, ఏడుగురు విటులు, ఆరుగురు నిర్వాహకులు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం స్పాసెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహించే స్థావరాలపై సీసీఎస్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, టాస్క్‌ఫోర్స్, ఎస్ఆర్‌నగర్ పోలీసులు మూడు ప్రాంతాల్లోని స్పా సెంటర్లపై దాడులు నిర్వహించారు.

● బీకేగూడలోని ఓ అపార్ట్ మెంట్‌లోని ఫ్లాట్ అద్దెకు తీసుకుని మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ యాంటీ ట్రాఫికింగ్ వింగ్ పోలీసులు దాడులు నిర్వహించి యూసుఫ్ గూడకు చెందిన స్పా నిర్వాహకురాలు నడిమంటి అనూష (34) కార్మిక నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరైన విటుడు వినయ్‌బాబుతో పాటు ఐదుగురు మహిళలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు నిమిత్తం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

● అమీర్‌పేటలో విఠల్ చాంబర్స్‌లోని 2వ ఫ్లోర్‌లో గ్లోరీ ఆయుర్వేదిక్ ఫిజియోథెరపి హాస్పిటాలిటీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బోరబండకు చెందిన స్పా నిర్వాహకులు టి.కల్యాణి(41), చింతల్‌కు చెందిన సి.అశోక్‌కుమార్ (25), మియాపూర్‌కు చెందిన విటుడు ఎం.సాంబశివరెడ్డితో పాటు నలుగురు మహిళలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు నిమిత్తం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

● అమీర్‌పేట్ గురుద్వారా సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎన్.ఎస్.బ్యూటీ సెలూన్ అండ్ స్పాసెంటర్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలు అదిలాబాద్‌కు చెందిన ఎన్.సుధ(30), కస్టమర్లు వెస్ట్ గోదావరికి చెందిన సాగిరాజు దినేష్‌వర్మ, వరంగల్‌కు చెందిన జి.గౌతమ్, కుత్బుల్లాపూర్‌కు చెందిన ఎన్.రవికుమార్, బంజారాహిల్స్‌కు చెందిన చవన్ సురేందర్, గుంటూరుకు చెందిన పిన్ని ప్రవీణ్‌కుమార్‌తో పాటు వెస్ట్‌బెంగాల్‌కు చెందిన ఒక యువతిని అరెస్టు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బోయిగూడ సున్నం బట్టి సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. సున్నం బట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, న్యూ బోయిగూడ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బోయిగూడలోని సున్నం బట్టి కమ్యూనిటీ హాల్‌లో సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన, అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వం ద్వారా స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, ఆటపాటలు అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సర్కార్ బడులను అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మిపతి, కుషాల్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పుష్పలత, త్రినేత్రి, లక్ష్మిశ్రీదేవి, రత్నజ్యోతి, స్వప్నరాణి, హెప్సీబా, మహేశ్వరి, ఉన్నత పాఠశాల టీచర్లు రమణ, రేణుక, నాగలత, వీణ, మాధవి, సుమలత, రజిత పాల్గొన్నారు. భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన సభకు కార్పొరేటర్ హేమలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

## నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం బలి

మృతుడు కె.మహేష్

అమీర్‌పేట్, జూన్ 6: ట్రాన్స్‌ఫార్మర్‌కు అతి సమీపంలో ఉన్న గోడకు సిమెంట్ ప్లాస్టరింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన దినసరి కూలీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం సనత్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒడిషా కాశీనగర్‌కు చెందిన కె.మహేష్ (35), తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి మూసాపేట్ జనతానగర్‌లో నివాసముంటున్నాడు. భార్య భర్తలిద్దరూ దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. కాగా ఎర్రగడ్డలోని పికాక్ ఫంక్షన్‌హాల్లో కొనసాగుతున్న మరమ్మతు పనుల్లో భాగంగా, గురువారం ఫంక్షన్‌హాల్ ఆవరణలోని గోడలకు ప్లాస్టరింగ్ చేసే పనులను మహేష్ దంపతులు చేస్తున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌కు అతి సమీపంలో ఉన్న గోడకు ప్లాస్టరింగ్ పనులు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ పనులు జరుగుతుండటంతో విద్యుత్ నిలిపివేయాల్సిందిగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆసిఫ్‌ను దంపతులిద్దరూ కోరారు. కాగా ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంట్ సరఫరా లేదని చెప్పడంతో మహేశ్ ప్లాస్టరింగ్ పనులు మొదలు పెట్టారు. ప్లాస్టరింగ్ చేసే క్రమంలో మహేశ్‌కు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పక్కనే ఉన్న మహేశ్ భార్య కన్నీరు మున్నీరుగా విలపించింది. తన భర్త మరణానికి కారణం సూపర్‌వైజర్ నిర్లక్ష్యమే కారణమని పేర్కొంది. కరెంట్ ఆఫ్ చేయమని ముందే చెప్పినా పట్టించుకోకుండా తన భర్త ప్రాణాలు తీశాడని రోధించడంతో చూపరులను కంటతడి పెట్టించింది. భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన హాలు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ నిండు ప్రాణం బలైంది. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీఈఓ రోహిణి

అడ్డగుట్ట, జూన్ 6: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని హైదరాబాద్ డీఈఓ రోహిణి సూచించారు. శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ రోహిణి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యా బోధనతో ఆగిపోకుండా పదవ తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలా పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని తెలుసుకోవడం కోసం అడ్డగుట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉదయం 5 గంటల సమయంలో విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పరిశీలించడం అభినందనీయమని ఆమె తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని ఆమె తెలిపారు. ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాలునాయక్, డిప్యూటీ ఐఓఎస్ మదన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

మారేడ్‌పల్లి, జూన్ 6: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మార్చి 16న గుర్తుతెలియని వృద్ధురాలు (70) అనారోగ్యంతో స్పృహతప్పి పడిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 5వ తేదీన రాత్రి 11 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి ఒంటి పై పింక్ రంగు చీర, నలుపు రంగు జాకెట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి సంబందికులు ఏవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

## చండ్ర రాజేశ్వరరావు ఆదర్శం

చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్ నగర్, జూన్ 6: సమాజానికి తొలితరం కమ్యూనిస్టు నేత దివంగత చండ్ర రాజేశ్వరరావు అందించిన సేవలు శ్లాఘనీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. చండ్ర రాజేశ్వరరావు 111వ జయంతి సందర్భంగా శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో చండ్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండి కష్టజీవుల అభ్యున్నతి కోసం చండ్ర రాజేశ్వరరావు తన జీవితానే అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుపాక అనిల్ కుమార్, రత్నాకర్ రావు, ఆర్.అంజయ్యనాయక్, మాజీద్ అలీ ఖాన్, సందీప్, సత్తిబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణం పై అవగాహన ర్యాలీ

చిక్కడపల్లి, జూన్ 6: బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పర్యావరణ అవగాహన ర్యాలీ, మొక్కల పెంపకం డ్రైవ్‌ను నిర్వహించారు. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం' అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీని కొనసాగించారు. ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గాంధీలో అభయ సపోర్ట్ సెంటర్ ప్రారంభం

అభయ సపోర్ట్ సెంటర్ ప్రారంభించిన సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి

బన్సీలాల్ పేట్, జూన్ 6 : గాంధీ దవాఖాన, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో సహాయం కోసం ఎదురు చూస్తున్న మహిళల కోసం అభయ సపోర్ట్ సెంటర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ రాజకుమారి ప్రారంభించారు. దవాఖానకు వచ్చే మహిళలకు అవసరమైన సేవలు అందించాలని ఆమె సూచించారు. మహిళా సాధికారత కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ప్రతినిధులను ఆమె అభినందించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ సుధార్‌సింగ్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ యోగి, ప్రొఫెసర్ డాక్టర్ రాధా, ప్రొఫెసర్ డాక్టర్ అజయ్‌మోహన్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ప్రతినిధులు సత్యవతి, అర్చనా రావు, మంజుల, పద్మ, శాంతిప్రియ, లలిత, లక్ష్మి, మీన, సోనీ, కిన్నెర పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

చిక్కడపల్లి, జూన్ 6: రజక, క్షౌర వృత్తిదాల సంఘాలకు ఉచిత విద్యుత్తు పథకంలోని పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. జూన్ 17 ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రజక, నాయి బ్రాహ్మణులకు జీవో నంబర్ 2 ప్రకారం 250 యూనిట్ల ఉచిత విద్యుత్ గత ప్రభుత్వంలో మంజూరు అయింది. ఈ పథకానికి 1,12,586 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. గత ఏడాది ఈ పథకానికి సంబంధించిన పెండింగ్ బకాయి బిల్లులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యుత్ అధికారులు ఇటీవల వృత్తిదారులపై ఒత్తిడి చేస్తూ బిల్లు చెల్లించాలని వేధిస్తున్నారని తెలిపారు. అనేక చోట్ల కనెక్షన్స్ కట్ చేస్తున్నారని ఆరోపించారు. లాండ్రీ, సెలూన్ షాపులు అద్దెకు తీసుకున్న షట్టర్లు ఖాళీ చేయాలని యజమానులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కరెంటు బిల్లుల నిధులు మంజూరు చేసి విడుదల చేసేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా క్షౌరవృత్తిదాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్ మాట్లాడుతూ సెలూన్ పథకం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదం విష్ణు, రజక వృత్తుదాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజు, నరేష్, నాయకులు ఎం.బాలకృష్ణ, మల్లేష్, మరియాల గోపాల్, వెంకటస్వామి, రాకేష్, మనోహర్, సీహెచ్ నగేష్, యాదమ్మ, అల్వాల బాబు తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

మాదాపూర్, జూన్ 6: ఓ వ్యక్తి డిఫెన్స్ మద్యం బాటిళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. దీంతో వ్యక్తిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల అరెస్ట్ చేసి అతని వద్ద రూ. 5 లక్షల విలువైన పలు బ్రాండ్ల 160 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీపీ కిషన్ కేసు వివరాలను వెల్లడించారు. మియాపూర్ మాతృశ్రీ నగర్ లోని శ్రీ సాయి రెసిడెన్సీలో నివాసం ఉండే మన్నవ గాంధీ జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో డిఫెన్స్ మద్యం బాటిళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర వ్యక్తులకు అధిక ధరకు అమ్మాలనే ఆలోచించాడు. డిఫెన్స్‌కు చెందిన వ్యక్తుల ద్వారా పలు బ్రాండ్ల మద్యం బాటిళ్లను కొనుగోలు చేశాడు. తన ఇంటి పక్కనే రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని నిల్వ ఉంచేవాడు. సమాచారం అందుకున్న రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 6న సాయంత్రం 4గంటల సమయంలో మాతృశ్రీ నగర్‌లోని శ్రీ సాయి రెసిడెన్సీలో నివాసం ఉంటున్న మన్నవ గాంధీ ఇంటిపై దాడులు చేయగా షెడ్డులో ఉంచినట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద 160 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గాంధీని, మద్యం బాటిళ్లను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రూ.5 లక్షల విలువైన 160 డిఫెన్స్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.